క్లుప్తంగా

ఘనంగా కైలాసేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



కాత్యాయిని సమేత కైలాసేశ్వరస్వామి కల్యాణం

రాంబిల్లి: కట్టుబోలు గ్రామంలో గురువారం శ్రీ కాత్యాయిని సమేత కైలాసేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని కనులపండవగా నిర్వహించారు. భక్తులు స్వామివారు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని , ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ



కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు

మునగపాక : మునగపాకలో కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి పండగ చేపట్టిన కుటుంబాలు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంఘ అధ్యక్షులు బుద్ద వెంకట్‌తో పాటు కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, మునగపాక ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఇందిరమ్మ కాలనీ అధ్యక్షుడు ఆడారి వెంకటప్పారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

వాట్సప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికావు

మునగపాక : కొంతమంది వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదని మునగపాక ఎస్‌ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకరిపై ఒకరు విమర్శించుకునేలా వాట్సాప్‌లలో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రశాంతతకు దెబ్బ తగులుతుందన్నారు. వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌లతో పాటు గ్రూపుల్లో తప్పుడు మెసేజ్‌లు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా శాంతియుతంగా మెలగాలని ప్రసాదరావు కోరారు.

మూలపేట గ్రామాభివృద్ధికి కృషి



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : మూలపేట గ్రామాభివృద్ధికి పాలకవర్గ సభ్యుల సహకారం అభినందనీయమని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. ప్రజా సమస్యలపై పాలకవర్గ సభ్యులు దృష్టి సారించాలన్నారు. గురువారం మూలపేటలో పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలకవర్గం కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ గ్రామ ప్రగతికి సంబంధించిన నివేదిక చదివి వినిపించారు. ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, ఇతర పాలకవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : పంచదార్ల గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్సాహంగా విద్యార్థుల బడిబాట



వెంకటనగరం పాఠశాలకు హాజరైన విద్యార్థులు



పాఠశాలలకు పంపిణీకి సిద్ధంగా ఉన్న విద్యాకానుక కిట్ల లోడుతో విద్యాశాఖ సిబ్బంది



కేశవరం పాఠశాలకు హాజరైన విద్యార్థులు

- పునఃప్రారంభమైన పాఠశాలలు



బాలికల ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్న విద్యార్థులు



అరబుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో హాజరైన విద్యార్థులు

పాయకరావుపేట : వేసవి సెలవులు అనంతరం మండలంలో గల పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలో 12 ఉన్నత పాఠశాలలు, 40 ప్రైమరీ పాఠశాలలు, 5 యుపి పాఠశాలలు వున్నాయి. వీటిలో 6 వేల మంది ఉపాధ్యాయులు విద్యను అభ్యసిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు కె.ఎస్.గాంధీ, జి.రమేష్ బాబు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు పాఠ్యా పుస్తకాలు, స్కూల్‌బ్యాగులు, బూట్లు కూడా అయా పాఠశాలలకు మండల కేంద్రం నుంచి పంపించడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

అందని విద్యా కానుక

ఎస్.రాయవరం: మండలంలో వేసవిరోజుల్లో అనంతరం ఒక్క రోజు ఆలస్యంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభించారు. గడిచిన అయిదేళ్లలో పాఠశాలలు తెరచిన రోజే పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కానుకలు అందజేసి ఉత్సాహకరమయిన వాతావరణం నెలకొల్పేవారు. అయితే ఆ పరిస్థితి ఈ ఏడాది పాఠశాలలో జరగలేదు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు విద్యాకానుకలు , యూనిఫాం, బూట్లు, పాఠ్య పుస్తకాలు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఈ పాఠశాలకు హాజరైన విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండానే, మధ్యాహ్న భోజనం పెట్టి సమయం ముగిసే వరకు విద్యార్థులను ఉంచి ఇళ్లకు పంపారు.

అరకొరగా విద్యార్థుల హాజరు

కోటవురట్ల: సర్కారు బడులు గురువారం ప్రారంభమయ్యాయి. 50 రోజుల సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థుల తాకిడి పెద్దగా కనిపించలేదు. ఇంకా కొందరు విద్యార్థులు సెలవులలో నుంచి బయటపడలేదు. దాంతో చాలా పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోయాయి. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 35, ఎంపీయూపీ 10, హైస్కూల్స్ 5, ఒక కేజీబీవీ ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా సమూలంగా మార్పు చేసి అభివృద్ధి చేశారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించారు. గతంలో సర్కారు బడులపై ఉన్న చిన్నచూపు మాయమై ఆ స్థానంలో ఎంతో గౌరవం ఏర్పడేలా చేశారు. విద్యార్థులు సగౌరవంగా పాఠశాలలకు వెళ్లేలా సంస్కరణలు చేశారు. పాఠశాలలు తెరిచిన రోజు నుంచే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీతో పాటు పాఠ్యపుస్తకాలు ఉచితంగానే అందించేవారు. అయితే గురువారం మాత్రం మండలంలో ఎక్కడా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందించలేదు. పాఠ్యపుస్తకాలు ఇంకా పాఠశాలలకు చేరలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తొలిరోజు విద్యార్థులకు అందని విద్యార్థి కిట్లు

మునగపాక:మండల వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునప్రారంభమయ్యాయి.వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. అయితే తొలి రోజున విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యార్థి కిట్లు గాని, పుస్తకాలు గాని ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా సేవలందించిన కాలంలో పాఠశాలలు తెరిచే మొదటిరోజున విద్యార్థులకు అవసరమయ్యే కిట్లు, పుస్తకాలు అందించిన విషయం అందరికీ తెలిసిందే. కాగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే విద్యార్థి కిట్లను అందజేస్తామని ఎంఆర్‌సీ కార్యాలయం ఉద్యోగి తెలిపారు.

అధైర్య పడొద్దు...అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, హాజరైన పార్టీ శ్రేణులు

- ఏ సమస్య వచ్చినా ప్రజల పక్షాన పోరాడదాం
- పార్టీ శ్రేణులకు కంబాల జోగులు దిశా నిర్దేశం

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనునిత్యం అండగా నిలుస్తానని పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ , మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు హామీ ఇచ్చారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద ఎస్.రాయవరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓడిపోయినప్పటికి పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దన్నారు. గ్రామస్థాయిలో ఉన్న బలమయిన నాయకత్వం కార్యకర్తలకు, మండల స్థాయిలో మండల నాయకులు , నియోజకవర్గ స్థాయిలో తాను అను నిత్యం అందుబాటులో ఉంటామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పైసా అవినీతి లేకుండా, పారదర్శకంగా పథకాలు నగదు అందజేశారని, ఆ పథకాలకు మెరుగుదిద్ది చంద్రబాబు కాస్త ఎక్కువ ఇస్తానని చెప్పారని ఆ నగదుకు ప్రజలు ఆశపడి కాస్త ఓటు బ్యాంకు అటువైపు మళ్లిందన్నారు. ప్రజల ఆశను, వారి తీర్పును గౌరవించాలన్నారు. అయితే తలకు మించిన హామీ నెరవేర్చకుంటే ప్రజలే తిరుగుబాటు చేస్తారన్నారు. ఆ సమయంలో మనమంతా ప్రజలకు అండగా నిలిచి నిజమయిన జగన్‌మోహన్‌రెడ్డి పాలన గుర్తు చేయాలన్నారు. గెలుపు ఉత్సాహంలో ఉన్న తెలుగు తమ్ముళ్లు కవ్వింపులకు పాల్పడి గొడవలకు కాలు దువ్వుతారని, వాటికి దూరంగా ఉండి ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అధికార టీడీపీ ఏ సంక్షేమ పథకం అమలు చేయకపోయినా ప్రశ్నించేందుకు ప్రజల తరపున మనముండాలని సూచించారు. టీడీపీతో పాటు , జనసేన, బీజేపీ కలయికలు పడిన ఓటు శాతం మెజార్టీలను బట్టి ఈవీఎంలలో ట్యాంపరింగ్ జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, టీడీపీ అంచనాలు మించి మెజార్టీ రావడం పలు అనుమానాలకు అద్దం పడుతోందన్నారు. ఏది ఏమయినా పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీ ఓడిపోయి ఉన్న కష్ట కాలంలో కూడా అన్ని గ్రామాల్లో నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయమని చెప్పారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకులు బొలిశెట్టి గోవిందు, జిల్లా పార్టీ కమిటీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, వెదుళ్ల బంగారి, చేకూరి శ్రీరామచంద్రరాజు, మధువర్మ, వియ్యపు వరహాలు, అద్దేపల్లి నూకునాయుడు, గుర్రం నానాజీ, కర్రి వరహాలరావు, కుంచాల అప్పారావు, కాసెపు అప్పన్న, పిట్ల నాయుడు, చోడిపల్లి కోదండం, యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, గాడి అప్పలనరసింహం, మైలపల్లి శ్రీను, మల్లే లోవరాజు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, కొర్ని రాజా రమేష్, జగన్‌సేవాదళ అధ్యక్షులు అమ్మాజి, మహిళా నాయులు బోయిన లక్ష్మి పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల పెంపకంపై అవగాహన



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

మునగపాక : మేలుజాతి పశువుల పెంపకం ద్వారా మెరుగైన బాల దిగుబడులు సాధించవచ్చని పశువైద్యాధికారిణి పద్మజ అన్నారు. మండలంలోని ఒంపోలులో రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త నిర్వహణలో గురువారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలకరిలో పశుపోషణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు అందించే గడ్డి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీజన్‌లో పశువులకు వచ్చే గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలన్నారు. పాడి విషయంలో సందేహాలుంటే 18004198800 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు గణపర్తిలో వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



గణపర్తిలోని వీరాంజనేయస్వామి

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో వీరాంజయనేయ స్వామి 31వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని, రాత్రికి ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు బాలాజీ నగర్ కాలనీ సభ్యులతో పాటు యూత్ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ కాటా అప్‌గ్రేడ్



ఆయిల్‌పామ్ కాటాను ప్రారంభోత్సవంలో పతంజలి కంపెనీ అధికారులు

కోటవురట్ల: ఆయిల్‌పామ్ రైతుల కోసం పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ కాటాను అందుబాటులోకి తీసుకొచ్చింది. మండల కేంద్రంలో గతంలో ఈ కంపెనీకి సంబంధించి 2 టన్నుల సామర్థ్యన్న లెక్కించే కాటా ఉండేది. మండలంలో ఆయిల్‌పామ్ సాగు గణనీయంగా పెరగడంతో ఉత్పత్తి కూడా పెరిగింది. కాటా సరిపోకపోవడంతో రైతులు వేరే ప్రాంతాలకు ఆయిల్‌పామ్ గెలలను తీసుకువెళ్లాల్సి వచ్చేది. సమస్యను గుర్తించిన అధికారులు 2 టన్నుల కాటాను మార్చి 20 టన్నుల కాటాను ఏర్పాటు చేశారు. ఈ కాటాను పతంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్ గురువారం ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, రైతులు పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : యలమంచిలి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం రాంబిల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా ఈ నెల 14, 16, 18 తేదీల్లో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి డివిజన్ ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని దీనిని రైతులు, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రేపు ఏటికొప్పాకలో.. : దార్లపూడి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏటికొప్పాక ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఈ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు,తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి.

వైభవంగా మరిడిమాంబ, బంగారమ్మ పండగ



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు

కె.కోటపాడు: చౌడువాడలో గ్రామదేవతలు మరిడిమాంబ, బంగారమ్మ పండగ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో యువకులు ప్రసాద వితరణ చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చూడి పశువు సంరక్షణతో సత్ఫలితాలు



చూడి పశువు

కోటవురట్ల : చూడి పశువు పోషణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధ్యపడతాయని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. చూడి పశువు సంరక్షణపై ఆయన సలహాలు, సూచనలు అందజేశారు.

చూడి పశువు సంరక్షణ ఇలా...

పశువు గర్భం దాల్చిన నాటి నుండి చూడి పశువుకు, గర్భంలో పెరుగుతున్న దూడకు సంరక్షణ అవసరం. గర్భ కాలంలో మొదటి కొద్ది నెలలో పెరిగిన దాని కంటే చివరి రెండు నెలలో 4 రెట్లు వేగంగా దూడ పెరుగుతుంది. అందువల్ల చూడి పశువుల సంరక్షణలో జాగ్రత్తలు చాలా అవసరం. చూడి చివరి రెండు నెలలో దాణాను పెంచడంతో పాటు పప్పు జాతికి చెందిన గడ్డి రూపంలో అధిక పోషకాలను అందించాలి. ఇలా చేయడం వల్ల దూడ పెరుగుదలకే కాకుండా పశువు ఈనిన వెంటనే పాల ఉత్పత్తి పెరుగుతుంది.

చూడి పశువు ఈనే వరకు పాలు తియ్యడం మంచిది కాదు. ఈనడానికి రెండు నెలల ముందు(7వ నెల) నుండి పాలను తీయడం మానేయాలి. అలా చేస్తే ఈత తర్వాత పాల ఉత్పత్తి తగ్గదు. పుట్టిన దూడకు పొట్టలో పురుగులు, నట్టల సమస్య లేకుండా చూడి చివరి 3 నెలల్లో చూడి పశువుకు పురుగులను నిర్మూలించేలా మందు వెయ్యాలి. పాలు పితకడం ఆపిన తర్వాతి కాలంలో చూడి పశువు బరువు గణనీయంగా పెరిగేలా చూడాలి. చివరి రెండు నెలల్లో 45-60 కిలోల బరువు పెరగాలి.

ఈతకు ముందు జాగ్రత్తలు..

ఈతకు ముందు ఆవు శరీరంలో , ప్రవర్తనలో స్వల్ప మార్పులు వస్తాయి. ఈనడానికి రెండు వారాల ముందు పొదుగు పెద్దగా అవుతుంది. కొన్ని సందర్భాలలో పొదుగు నుండి పాలు కారుతుంటాయి. పెల్విక్ లిగమెంట్లు వదులుగా అవుతాయి. పశువు ఆందోళనగా ఉండి సక్రమంగా మేయదు. ఈ సమయంలో పశువు ఈనడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి.

- ఈతకి వారం ముందు చూడి పశువును మిగిలిన పశువుల నుండి వేరు చేసి పొడిగా, శుభ్రంగా , ప్రశాంతంగా ఉండే కొట్టాంలో కట్టాలి. పొడిగా ఉండేలా ఎండుగడ్డితో పక్క వేయాలి.
- ఎక్కువ పాల దిగుబడినిచ్చే పశువులలో ఈనిన వెంటనే పాల జ్వరం రాకుండా చూలుతో ఉన్న సమయంలో కాల్షియం, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఇవ్వాలి.
- ఈనడానికి ఒక వారం ముందు విటమిన్ డి ఇంజక్షన్ వేయించాలి.
- నీటి సంచి కనిపించిన రెండు గంటలకు కూడా దూడ కాళ్లు బయటకు రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి. దూడ కాళ్లు కనబడిన అరగంట తరువాత కూడా ఎటువంటి మార్పు కనబడకపోతే వెంటనే సంప్రదించాలి. రెండు కాళ్లకు బదులు ఒక కాలు మాత్రమే బయట కనబడినా డాక్టరుకు చూపించాలి. ఈనిన 24 గంటలలోపు మాయ పడకపోయినా వైద్యునికి చూపించాలి.

16న సరస్వతీదేవి పూజ

చోడవరం రూరల్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 16న విద్యార్థులతో వాగ్దేవి పూజ నిర్వహించనున్నట్టు వాసవి యూత్ క్లబ్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో ఆదివారం ఉదయం 7 గంటలకు సరస్వతీ పూజ నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే వారు పూలు తీసుకుని రావలసిందిగా తెలిపారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు పెన్ను, పెన్సిల్, ఎరాసర్, షార్పనర్, స్కేల్‌తోపాటు అమ్మవారి రక్షను అందజేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు.

నేడు గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం

చోడవరం రూరల్: స్థానిక సంజీవనీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలను ఉచితంగా అందించడమే గాకుండా కార్డియాలజిస్ట్ పృథ్వీరాజ్ అట్టాడ హృద్రోగులను పరీక్షించి తగు వైద్య చికిత్స అందచేస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ శిబిరానికి హాజరయ్యే రోగులు ముందుగా 9603378145 నంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరాయి.

ఘనంగా మరిడితల్లి పండగ



అమ్మవారికి కానుకలు ఇస్తున్న భక్తులు

గొలుగొండ: మండలంలో కొంకసింగిలో మరిడితల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొలువైన అమ్మవారిని గ్రామస్తులతోపాటు ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, నాగాపురం, లింగంపేట, పాడి, రత్నంపేట తదితర గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు చేసి కానుకలతో మొక్కులు సమర్పించుకున్నారు. పండగ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ఎండ్ల పందేలు హోరాహోరీగా సాగాయి. వీటిని తిలకించడానికి సమీప ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈలలు, కేకలతో సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి పది జతల ఎడ్లబళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున కమిటీ సభ్యులు అందజేశారు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు కె.జె.పురంలో శ్రీరాధాకృష్ణుల తీర్థం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంట రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద శ్రీరాధాకృష్ణుల తీర్థం ఈ నెల 15న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.